క్లుప్తంగా

భక్తిశ్రద్ధలతో సామూహిక వ్రతాలు



బిజినేపల్లి: పాలెం వేంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం సామూహిక వ్రతాలు నిర్వహించారు. వందల సంఖ్యలో దంపతులు పాల్గొని పూజలు చేశారు. ఆలయ ప్రధాన అర్చకులు కురవి రామానుజాచార్యులు ఆధ్వర్యంలో సత్యనారాయణస్వామివారి వ్రతాలు ఆచరించారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదలు, అన్నప్రసాదం పంపిణీ చేశారు.

ఉపాధి పనులు వేగవంతం చేయాలి

తాడూరు: మండల కేంద్రంతో పాటు ఆయా గ్రామాలలో చేపట్టిన ఉపాధి పనులను వేగవంతం చేయాలని ఎంపీడీఓ ఆంజనేయులు అన్నారు. శనివారం మండల పరిషత్ కార్యాలయంలో ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు ఉపాధి సిబ్బందితో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామాల వారిగా కార్యదర్శులను ఉపాధి సిబ్బందితో జరుగుతున్న పనులను సమీక్షించారు. కూలీల సంఖ్యను పెంచి పనులు జరిగే ప్రదేశాల దగ్గర కూలీలకు కనీస వసతులు ఏర్పాటు చేయాలన్నారు. పనికోసం దరఖాస్తు చేసుకున్నప్రతి కూలీకి పని కల్పించాలన్నారు. సమావేశంలో ఏపీఓ చంద్ర సిద్దార్థ, పంచాయతీ, ఉపాధిహామీ సిబ్బంది పాల్గొన్నారు.

యూడైస్ డేటా పరిశీలన

తాడూరు: మండలంలోని అలాపూర్ పాఠశాలలో శనివారం ఏఎంఓ రాజు నాయక్ పాఠశాల యూడైస్ డేటాను పరిశీలించారు. ఉపాధ్యాయ విద్యార్థుల రిజిస్టర్లను పరిశీలించి విద్యార్థుల హాజరు, విద్యా సామర్థ్యాల గురించి ఉపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు. పాఠశాల హెచ్‌ఎం శ్రీనివాస్‌రెడ్డితో పాఠశాలలో నెలకొన్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు.

ప్రైవేట్ దీటుగా ప్రభుత్వ పాఠశాలలు

తాడూరు: ప్రైవేట్ దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో విద్య అందుతోందని ఎంఈఓ శ్రీనివాస్ రెడ్డి అన్నారు. శనివారం మండలంలోని యత్నాతాపూర్ ప్రాథమిక పాఠశాలలో హెచ్‌ఎం ప్రసన్న సమతా ఆధ్వర్యంలో పాఠశాలలో విద్యార్థులకు అర్థమయ్యేరీతిలో వినూత్న కార్యక్రమాన్ని చేపట్టారు. డ్రస్ కోడ్‌తో పాటు పట్టా సర్టిఫికెట్లను అందజేశారు. అనంతరం పాఠశాల వార్షికోత్సవాన్ని నిర్వహించారు.

ఆరోగ్యంపై అవగాహన



చారకొండ: ప్రభుత్వ ఆయుర్వేద వైద్యశాల ఆధ్వర్యంలో పోషణ పక్షం కార్యక్రమంలో భాగంగా శనివారం మండల కేంద్రంలో జెడ్పీ హెచ్‌ఎస్‌లో ఆయుర్వేద వైద్యురాలు గాయత్రి విద్యార్థిని, విద్యార్థులకు తల్లిదండ్రులకు ఆరోగ్యంపై అవగాహన కల్పించారు. నిత్యం యోగా, వ్యాయామం చేయాలని సూచించారు. అనంతరం విద్యార్థులకు ఐరన్ ఆయుర్వేద మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో జీహెచ్‌ఎం భగవాన్ రెడ్డి, ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ టీచర్లు అన్నపూర్ణ, ఆశవర్కర్లు రాములమ్మ, సువర్ణ ఉన్నారు.

కొండారెడ్డిపల్లిలో కంటి వైద్య శిబిరం

వంగూరు: ప్రతిఒక్కరు ఆరోగ్యంపై శ్రద్ధ తీసుకోవాలని రైతు కమిషన్ సభ్యుడు కేవీఎన్ రెడ్డి, గ్రామ అభివృద్ధి కమిటీ చైర్మన్, ముఖ్యమంత్రి సోదరుడు కృష్ణారెడ్డిలు అన్నారు. మండలంలోని కొండారెడ్డిపల్లిలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కుటుంబం శంకర నేత్రాలయం సంయుక్తంగా ఏర్పాటు చేసిన కంటి చికిత్స శిబిరాన్ని శనివారం వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దాదాపు పది రోజులపాటు క్యాంపు కొనసాగుతుందన్నారు. కంటి పరీక్షలు, చికిత్స అవసరం ఉన్న వారికి అద్దాలు అందజేస్తామన్నారు. కార్యక్రమంలో ఐక్యత ఫౌండేషన్ చైర్మన్ సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి, గ్రామస్తులు వేమారెడ్డి, కృష్ణారెడ్డి, లాలూయాదవ్, రాజేందర్‌రెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, రాఘవేందర్ తదితరులు పాల్గొన్నారు.

రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

అచ్చంపేట రూరల్: రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ అంతటి రజిత అన్నారు. శనివారం మండలంలోని నడింపల్లి, చందాపూర్ గ్రామాల్లో వరిధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. రైతులు దళారులను నమ్మొద్దని, ప్రభుత్వం ఏర్పాటు చేసిన కేంద్రాల్లోనే ధాన్యం అమ్మాలని కోరారు. పీఏసీఎస్ చైర్మన్ రాజిరెడ్డి, ఏఓ కృష్ణయ్య, రామనాథం, కృష్ణ పాల్గొన్నారు.

సమస్యలతో సతమతం

- శిథిలావస్థలో అంగన్‌వాడీ కేంద్రాలు
- మౌలిక వసతులు కరువు



ఎస్సీ కాలనీలో ఇరుకుగా ఉన్న గదిలో వంట చేస్తున్న అంగన్‌వాడీ ఆయా



ఉప్పునుంతల బీసీ కాలనీలో శిథిలావస్థకు చేరిన అంగన్‌వాడీ కేంద్రం

ఉప్పునుంతల: మండలంలోని అంగన్‌వాడీ కేంద్రాలు సమస్యలతో సతమతమవున్నాయి. మౌలిక వసతులు లేక తప్పనిపరిస్థితిలో నెట్టుకురావాల్సిన దుస్థితి నెలకొంది. కొన్నేళ్ల కిందట నిర్మించిన భవనాలు మరమ్మతులకు నోచుకోక శిథిలావస్థకు చేరుకున్నాయి. కేంద్రాలకు వచ్చే గర్భిణులు, బాలింతలతోపాటు అంగన్‌వాడీ టీచర్లు ఏళ్ల తరబడిగా అవస్థలు పడుతున్నారు. మండలంలో మొత్తం 56 అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. వాటిలో 24 అంగన్‌వాడీ కేంద్రాలకు స్వంత భవనాలు ఉండగా జయరాంతండా, వెల్టూరు రెండు అంగన్‌వాడీ కేంద్రాలు అద్దె భవనంలో కొనసాగిస్తున్నారు. మరో 31 కేంద్రాలకు ఉచితంగా సమకూర్చిన భవనాల్లో కొనసాగుతున్నాయి. పాఠశాల ప్రహరీలో ఉన్న భవనాల్లో, పాఠశాలల్లో ఆయా కేంద్రాలను కొనసాగిస్తున్నారు. మండలంలో 15 అంగన్‌వాడీ కేంద్రాల్లో టీచర్ పోస్టులు ఖాళీగా ఉండగా 35 వరకు కేంద్రాల్లో ఆయా పోస్టులు ఖాళీగా ఉన్నాయి. మండల కేంద్రంతోపాటు మండలంలోని దేవదారి కుంట తండా, కాంసానిపల్లి తండా, మామిళ్లపల్లి, కాంసానిపల్లి తదితర దాదాపు అన్ని గ్రామాల్లో కొన్నేళ్ల కిందట నిర్మించిన కేంద్రాలు పూర్తిగా శిథిలావస్థకు చేరుకున్నాయి. ఉప్పునుంతల మండల కేంద్రంలోని బీసీ కాలనీలో ఉన్న అంగన్‌వాడీ కేంద్రం పూర్తిగా శిథిలాస్థకు చేరడంతో పక్కనే ఉన్న ఏఓ క్వార్టర్‌లో కేంద్రాన్ని కొనసాగిస్తున్నారు. మండలంలో మొత్తం అంగన్‌వాడీ కేంద్రాల్లో ఏడు నెలల నుంచి మూడేళ్ల వయస్సులోపు పిల్లలు 788 మంది, మూడు నుంచి ఆరేళ్ల వయస్సులోపు పిల్లలు 540 మంది ఉన్నారు. 164 మంది గర్భిణులు, 151మంది బాలింతలు ఉన్నారు. వారందరికీ కేంద్రాల ద్వారా పౌష్టికాహారాన్ని అందిస్తున్నారు. పాలతో పాటు కోడి గుడ్లు, ఇతర పౌష్టికాహారం అందిస్తున్నారు. గర్భిణులు, బాలింతలకు కేంద్రాల్లోనే ఒక పూట భోజనం అందిస్తున్నారు. మండంలో దాదాపుగా అన్ని అంగన్‌వాడీ కేంద్రాల్లో తాగునీటి వసతి, బాత్‌రూంల వసతిలేక ఇబ్బందులు పడుతున్నారు. కరెంట్ వసతి లేక ఎండాకాలంలో ఉక్కబోతతో పిల్లలు నానా అవస్థలు ఎదుర్కొంటున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి శిథిలాస్థలకు చేరిన అంగన్‌వాడీ కేంద్రాల స్థానంలో అన్ని వసతులతో కూడిన నూతన భవనాలను మంజూరీ చేయించడంతో పాటు మౌలిక వసతులు కల్పించాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

నివేదికలు పంపించాం

బల్మూరు ప్రాజెక్టు పరిధిలోని ఉప్పునుంతలతో పాటు ఇతర మండలాలకు సంబంధించిన అంగన్‌వాడీ కేంద్రాల్లో మరుగుదొడ్లు, మూత్రశాలల నిర్మాణాలతోపాటు తాగునీరు తదితర మౌలిక వసతుల కోసం అధికారులకు నివేదికలు పంపించాం. ఇప్పటివరకు విద్యుత్ సౌకర్యం కల్పించలేదు. పాత భవనాల పరిస్థితులను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. కొన్ని స్వంత భవనలు ఉన్న కేంద్రాలకు మూత్రశాలలు మంజూరయ్యాయి.

– దమయంతి, ఐసీడీఎస్ సీడీపీఓ, బల్మూర్ ప్రాజెక్టు

ఏసు బోధనలు అనుసరణీయం



ర్యాలీని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే నారాయణరెడ్డి

కల్వకుర్తి టౌన్: ఏసుక్రీస్తు బోధనలు ప్రతిఒక్కరికి అనుసరణీయమని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. శనివారం పట్టణంలోని ఎంబీ చర్చి ఆధ్వర్యంలో పాలమూరు చౌరస్తా నుంచి ప్రారంభమైన క్రైస్తవుల రన్‌ఫర్ జీసస్ ర్యాలీని ఎమ్మెల్యే ప్రారంభించారు. పట్టణంలోని పురవీధుల గుండా రన్ కొనసాగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అందరిని సమానంగా చూడాలని ప్రేమ, కరుణతో మెలగాలని ఏసు బోధించాడని వివరించారు. అనంతరం పట్టణంలోని పురవీధుల గుండా రన్‌ఫర్ జీసస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో పీసీబీ మెంబర్ బాలాజీసింగ్, పాస్టర్లు, క్రైస్తవ సంఘ సభ్యులు పాల్గొన్నారు.

కల్యాణలక్ష్మి చెక్కుల అందజేత

పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నియోజవకర్గ పరిధిలోని చారకొండ, వెల్దండ మండలాలకు చెందిన పలువురికి కల్యాణలక్ష్మి చెక్కులను ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అందజేశారు. చారకొండ మండలంలోని 11 మందికి, వెల్దండ మండలంలోని 61 మందికి చెక్కులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆయా మండలాలల తహసీల్దార్లు, స్థానిక నాయకులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

పెండింగ్ బిల్లులను వెంటనే చెల్లించాలి

ఉప్పునుంతల: ఉపాధి పనులకు సంబంధించి కూలీలకు రావల్సిన పెండింగ్ బిల్లులను ప్రభుత్వం వెంటనే చెల్లించాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి చింతల నాగరాజు డిమాండ్ చేశారు. శనివారం మండలంలోని జప్తీ సదగోడులో ఉపాధి కూలీలు చేస్తున్న పని ప్రదేశాన్ని సందర్శించిన ఆయన కూలీలతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. ఉపాధి కూలీలకు పనిదినాలను 200లకు పెంచాలని కోరారు.

జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలి



నాగర్‌కర్నూల్: అర్హులైన జర్నలిస్టులందరికీ ఇళ్ల స్థలాలు, ఇందిరమ్మ ఇళ్ల పథకంలో ప్రాధాన్యం ఇవ్వాలని రెవెన్యూ సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డికి తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్,హెచ్–143 యూనియన్ నాయకులు వినతిపత్రం అందజేశారు. శనివారం నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలో నిర్వహించిన భూభారతి అవగాహన సదస్సుకు హాజరైన మంత్రి ఆ సంఘం నాయకులు కలిశారు. ఈ సందర్భంగా ఆ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆస్కానీ మారుతి సాగర్, రాష్ట్ర సహాయ కార్యదర్శి అబ్దుల్లా ఖాన్ మాట్లాడుతూ అర్హులైన ప్రతి జర్నలిస్టుకు అక్రిడేషన్ కార్డులు ఇవ్వాలన్నారు. జాతీయ నాయకులు జెమిని సురేష్, మహమ్మద్ రవూఫ్, ఎం.చంద్రశేఖర్ రావు, ఖానాపురం ప్రదీప్, రాజేష్ గౌడ్, శేఖరాచారిపాల్గొన్నారు.

వాల్‌పోస్టర్ విడుదల

వంగూరు: ఈనెల 21, 22వ తేదీల్లో శంషాబాద్‌లో జరిగే తెలంగాణ బిల్డింగ్ కన్‌స్ట్రక్షన్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర 4వ మహాసభను విజయవంతం చేయాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి శివశంకర్ అన్నారు. శనివారం మండలంలోని జాజాలలో ఇందుకు సంబంధించిన వాల్‌పోస్టర్‌ను విడుదల చేశారు. సంక్షేమ పథకాల్లో భవన నిర్మాణ కార్మికులకు ప్రాధాన్యత ఇవ్వాలని 50 సంవత్సరాలు నిండిన ప్రతి కార్మికునికి రూ.5 వేల పెన్షన్ ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో శ్రీనివాసులు, వెంకటస్వామి తదితరులు పాల్గొన్నారు.

సమ్మె విజయవంతం చేయండి

నాగర్‌కర్నూల్ రూరల్: మే 20న నిర్వహించే దేశ వ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలని సీఐటీయూ నాయకుడు ఆర్ శ్రీనివాసులు కోరారు. శనివారం సీఐటీయూ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. శివశంకర్, సుభాష్, సుల్తాన్, సురేష్, సత్యం, శ్రీనివాసులు, వెంకటస్వామి, సత్యం పాల్గొన్నారు.

రేపటి నుంచి ఉర్సు

కందనూలు: నాగర్‌కర్నూల్ పట్టణంలోని నాగనూలు రోడ్డునగల హజ్రత్ సయ్యద్ సద్రుద్దీన్ షా ఖాద్రీ రహమతుల్లా అలే ఉర్సు ఉత్సవాలు ఈ నెల 21వ తేదీన ప్రారంభమవుతాయని దర్గా ముతవల్లి షేక్ ఫహీముద్దీన్ చిష్తి ఉల్ ఖాద్రి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. సోమవారం రాత్రి 8:30 గంటలకు గంధోత్సవం నిర్వహిస్తునట్లు పేర్కొన్నారు. 22న అన్నదానం, 23న దీపోత్సవం ఉంటుందని పేర్కొన్నారు.

ధాన్యం దళారులకు విక్రయించొద్దు



జూపల్లిలో వరి కొనుగోలు కేంద్రం ప్రారంభిస్తున్న సింగిల్‌విండో చైర్మన్ గురువయ్య గౌడ్

చారకొండ: వరిధాన్యం దళారులకు విక్రయించి మోసపోవద్దని సింగిల్‌విండో చైర్మన్ జెల్ల గురువయ్య గౌడ్ అన్నారు. శనివారం మండలంలోని జూపల్లి రైతు వేదిక కార్యాలయంలో ఆయన ప్రారంభించి మాట్లాడారు. కొనుగోలు కేంద్రాల్లో విక్రయించి, మద్దతు ధర పొందాలని సూచించారు. గ్రేడ్ ఏ రకం ధాన్యానికి రూ.2320, సాధారణ రకం రకానికి రూ.2300 నిర్ణయించినట్లు తెలిపారు. క్వింటాకు రూ.500లు బోనస్ చెల్లిస్తుందన్నారు. కార్యక్రమంలో రంగాపూర్ సింగిల్ విండో చైర్మన్ సురేందర్ రెడ్డి, డీసీసీ ఉపాధ్యక్షుడు వెంకటయ్య యాదవ్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ ముస్తఫా, సింగిల్ విండో సీఈఓ వెంకటయ్య, భీమయ్య గౌడ్, ఏఈఓ వంశీ, నాయకులు బాలరాజు, జైపాల్, బిక్షపతి, రైతులు ఉన్నారు.

కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించాలి

వెల్దండ: ప్రభుత్వం ఏర్పాటు చేసిన వరి కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యాన్ని విక్రయించాలని సింగిల్‌విండో చైర్మన్ భాస్కర్‌రావు పేర్కొన్నారు. శనివారం మండల కేంద్రంలోని సింగిల్‌విండో కార్యాలయంలో వరికొనుగోలు కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. సింగిల్‌విండో వైస్ చైర్మన్ రాజేందర్‌రెడ్డి, వ్యవసాయ అధికారిణి శోభారాణి, అసిస్టెంట్ రిజిస్టర్ శ్రీనివాసులు, జూనియర్ ఆడిటర్ ముక్తాదిన్, మోతిలాల్, పర్వత్‌రెడ్డి, డైరెక్టర్లు శేఖర్‌ముదిరాజ్, మట్ట వెంకటయ్యగౌడు, రైతులు ఉన్నారు.

ఆర్డీఓ కార్యాలయం ఎదుట ధర్నా

నాగర్‌కర్నూల్ రూరల్: గ్రామాల్లో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ శనివారం సీపీఎం ఏరియా కమిటీ ఆధ్వర్యంలో ఆర్డీఓ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కార్యదర్శి పర్వతాలు మాట్లాడుతూ మండలంలోని మల్కాపూర్, పూలిజాల, మంతటి వివిధ గ్రామాలతో పాటు మున్సిపాలిటీ 17 వార్డులో సమస్యలను పరిష్కరించడంలో అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారన్నారు. ఆర్.శ్రీనివాసులు, గీత, యాదయ్య, శ్రీనివాసులు, అశోక్, మధు, సురేష్, వెంకటేష్, బాలరాజ్, సుభాష్ సుల్తాన్ కుర్మయ్య తదితరులు పాల్గొన్నారు.

నేడు జిల్లా స్థాయి బండలాగుడు పోటీలు

లింగాల: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో ఆదివారం జిల్లా స్థాయి సేద్యపు ఎద్దుల బండలాగడు పోటీలను నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు సింగిల్‌విండో మాజీ చైర్మన్ కొండల్‌రావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల వారు పోటీలలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

నేడు ఉచిత మెగా వైద్య శిబిరం

లింగాల: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో ఆదివారం ఉచిత మెగా వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు సమాచార హక్కు చట్టం రక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు కొర్ర కిషన్‌నాయక్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. శిబిరంలో అన్ని రకాల వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి ఉచితంగా మందుల పంపిణీ చేస్తామని పేర్కొన్నారు. ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు శిబిరం కొనసాగుతుందని వివరించారు. మండలంలోని ఆయా గ్రామాల ప్రజలు ఉచిత వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

రాజ్యాంగాన్ని పరిరక్షించుకుందాం



వెల్దండ: రాజ్యాంగ హక్కులను పరిరక్షించుకుందామని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు మోతిలాల్‌నాయక్ అన్నారు. శనివారం మండలంలోని కొట్ర, తిమ్మినోనిపల్లి గ్రామాల్లో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో రాజ్యాంగ పరిరక్షణ పాదయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా అంబేడ్కర్ నివాళులర్పించారు. ప్రజలందరికి రాజ్యాంగ హక్కులపై అవగాహన కల్పించాలన్నారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను అర్హులందరు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో కిసాన్‌సెల్ నియోజకవర్గ అధ్యక్షుడు పర్వత్‌రెడ్డి, నాయకులు రవీందర్‌రావు, శ్రీనివాస్‌యాదవ్, శేఖర్, పుల్లయ్య, ప్రశాంత్‌రెడ్డి, తదితరులు ఉన్నారు.

వాహనాల తనిఖీ

కోడేరు: మండలంలోని నర్సాయిపల్లి, సింగోటం క్రాస్‌రోడ్డు వద్ద శనివారం వాహనాల తనిఖీ చేపట్టారు. ఈ సందర్భంగా ఎస్ఐ గోకారి వాహనదారులకు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

కొనసాగుతున్న అద్దె బస్సు డ్రైవర్ల సమ్మె



సమ్మెలో కూర్చున్న ఆర్టీసీ అద్దెబస్సు డ్రైవర్లు

అచ్చంపేట రూరల్: సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ పట్టణంలోని ఆర్టీసీ డిపోలో చేపట్టిన అద్దె బస్సు డ్రైవర్ల సమ్మె నాలుగో రోజు శనివారం కొనసాగింది. ఈ సందర్భంగా వారికి సీఐటీయూ జిల్లా నాయకుడు శంకర్ నాయక్ మద్దతు తెలిపి మాట్లాడారు. ప్రైవేటు డ్రైవర్ల శ్రమను అద్దె బస్సు యజమానులు దోచుకుంటున్నారని ఆరోపించారు. కనీస వేతనం రూ. 26 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. డ్రైవర్లకు ఈఎస్ఐపీఎఫ్ సౌకర్యాలు కల్పించాలని, ప్రమాద బీమా ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలన్నారు. మహిళా సంఘం నాయకురాలు నిర్మల, ఆర్టీసీ అద్దె బస్సుల యూనియన్ నాయకులు సుధాకర్, శ్రీహరి, అనీల్ తదితరులు పాల్గొన్నారు.

అగ్నిప్రమాదాలపై అప్రమత్తంగా ఉండాలి



అవగాహన కల్పిస్తున్న ఫైర్ సిబ్బంది

నాగర్‌కర్నూల్ క్రైం: అగ్నిప్రమాదాలపై అప్రమత్తంగా ఉండాలని ఫైర్ ఆఫీసర్ కృష్ణమూర్తి అన్నారు. అగ్నిమాపక వారోత్సవాలలో భాగంగా శనివారం ఉయ్యాలవాడలోని ప్రాథమిక ఉన్నత పాఠశాలలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అంతకుముందు విద్యార్థులకు వ్యాసరచన పోటీలు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కృష్ణమూర్తి మాట్లాడుతూ అగ్నిప్రమాదాలు జరిగిన వెంటనే అధికారులకు సమాచారం ఇవ్వాలన్నారు. అప్పుడే ప్రమాద నివారణను తగ్గించేందుకు అవకాశం ఉంటుందన్నారు. అగ్ని ప్రమాదాలు జరిగినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై మాక్ డ్రిల్ చేస్తూ అవగాహన కల్పించారు. కార్యక్రమంలో లీడింగ్ ఫైర్ మాన్‌లు వహీదుద్దీన్, రంగస్వామి, సిబ్బంది ఖదీర్, శంకర్, మల్లేష్, వెంకటేశ్వరరావు, కైఫ్, అమరేందర్ పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

వెల్దండ: మండల కేంద్రానికి చెందిన చిమ్ముల అల్వాల్‌రెడ్డి అనారోగ్యంతో మృతి చెందాడు. శనివారం బాధిత కుటుంబాన్ని సీడబ్ల్యూసీ ప్రత్యేక ఆహ్వానితులు, మాజీ ఎమ్మెల్యే చల్లా వంశీచంద్‌రెడ్డి పరామర్శించి ఓదార్చారు. అదే విధంగా టాస్కీసీఓఓ సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి మృతుని కుటుంబాన్ని పరామర్శించి అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు విజయ్‌కుమార్ రెడ్డి, నాయకులు భూపతిరెడ్డి, ఆనంద్‌కుమార్, మోతీలాల్‌నాయక్, పర్వత్‌రెడ్డి ఉన్నారు.

సైబర్‌నేరాలపై అవగాహన



అచ్చంపేట రూరల్: విద్యార్థులు సైబర్‌నేరాలపై అప్రమత్తంగా ఉండాలని సిద్దాపూర్ ఎస్ఐ పవన్‌కుమార్ అన్నారు. శనివారం మండలంలోని ఐనోలు గిరిజన గురుకుల పాఠశాలలో విద్యార్థులకు సైబర్ నేరాలపై ఆయన అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ ప్రస్తుత టెక్నాలజీని వినియోగించుకొని కొందరు సైబర్‌నేరాలకు పాల్పడుతున్నారన్నారు. వ్యక్తిగత సమాచారం ఎవరికి చెప్పొద్దన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ పుష్పలత, వినయ శీల, పోలీసు సిబ్బంది భరత్, శ్రీకాంత్, సుధాకర్ పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత

వెల్దండ: మండలంలోని చౌదర్‌పల్లిలో నిర్వహిస్తున్న పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి వీధి నాటకానికి టాస్క్ సీఓఓ, ఐక్యత ఫౌండేషన్ చైర్మన్ సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి రూ.30వేలు సమకూర్చిన నగదును ఐక్యత ఫౌండేషన్ సభ్యులు నిర్వాహకులకు అందజేశారు. ప్రస్తుత సమాజంలో అంతరించిపోతున్న వీధి నాటకాలకు ప్రోత్సహించేందుకు ఆర్థికసాయం అందజేస్తునట్లు పేర్కొన్నారు. ఫౌండేషన్ సభ్యులు చంద్రశేఖర్, కొండల్‌యాదవ్, మల్లయ్య, శ్రీశైలం, లోడిగ శ్రీశైలం, నాటక బృందం సభ్యులు జంగయ్య, సాయిలు, గొడుగు రాములయ్య, తిర్పతయ్య, తదితరులు ఉన్నారు.

పశువులకు గాలికుంటు నివారణ టీకాలు



తిమ్మాజిపేట: పశువులకు గాలికుంటు నివారణ టీకాలు వేస్తునట్లు జిల్లా పశువైద్యాధికారి డాక్టర్ జ్ఞానశేఖర్ అన్నారు. శనివారం మండల కేంద్రంలో పశు వైద్య శిబిరాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. మండలంలోని అప్పాజిపల్లి, ఆవంచ, తిమ్మాజిపేట, లక్ష్మణ్ నాయక్‌తాండ తదితర గ్రామాలలో 591 తెల్లజాతి పశువులకు, 252 నల జాతి పశువులకు మొత్తం 843 పశువులకు వ్యాధి నివారణ టీకాలు వేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ ఉదయ్‌కుమార్‌రెడ్డి, డాక్టర్ శ్రావణి, సిబ్బంది తిరుపతయ్య, విజయ లలిత, పలువురు సిబ్బంది, గోపాల మిత్రలు పాల్గొన్నారు.

ఎంఈఓ ఆకస్మిక తనిఖీ

పెద్దకొత్తపల్లి: మండలంలోని మరికల్, పెద్దకార్పముల పాఠశాలలను శనివారం ఎంఈఓ శ్రీనివాస్‌రెడ్డి ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థుల ప్రగతి పత్రాలను ఈ నెల 23న ఇవ్వాలని కోరారు. అలాగే ఇంటర్నల్ ఆడిట్ ఉంటుందని హెచ్‌ఎంలు క్యాష్ బుక్‌లను, ఓచర్లను సిద్ధం చేసుకోవాలని సూచించారు.

బీమా డబ్బులు అందజేత

ఉప్పునుంతల: మండల కేంద్రానికి చెందిన మృతుడు మదనాగుల రాజుకు ప్రధానమంత్రి జీవనజ్యోతి పథకం ద్వారా రూ.2 లక్షలు మంజూరయ్యాయి. ఈ మేరకు శనివారం తెలంగాణ గ్రామీణ వికాస్ బ్యాంకు మేనేజర్ క్రాంతి కుమార్ ఖాతాదారుడి భార్య తిర్పతమ్మకు చెక్కు అందజేశారు. ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు.

పశ్చిమ బెంగాల్‌లో రాష్ట్రపతి పాలన విధించాలి



కందనూలు: పశ్చిమ బెంగాల్‌లో రాష్ట్రపతి పాలన విధించాలని జిల్లా వీహెచ్‌పీ అధ్యక్షుడు శివయ్యగౌడ్ అన్నారు. నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలో శనివారం వీహెచ్‌పీ ఆధ్వర్యంలో అంబేడ్కర్ విగ్రహం ఎదుట నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వక్ఫ్ బోర్డు చట్టానికి వ్యతిరేకంగా చేస్తున్న ఆందోళనలో హిందువులపై దాడుపై చేయడం అప్రజాస్వామ్యం అన్నారు. హిందూ దేవాలయాలను, గృహాలని, వ్యాపార సంస్థలను ధ్వంసం చేస్తూ కొందరు సంఘ విద్రోహ చర్యలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. ముఖ్యమంత్రి మమతా బెనర్జీ అండదండలతో విద్రోహ శక్తులు రెచ్చిపోతున్నారని పేర్కొన్నారు. అనంతరం కలెక్టర్‌కు వినతి పత్రం ఇచ్చారు. కార్యక్రమంలో హిందూసంఘాల నాయకులు, ఏబీవీపీ నాయకులు పాల్గొన్నారు.

తాగునీటి ఎద్దడి రాకుండా చర్యలు



తిమ్మాజిపేట: తాగునీటి సమస్య రాకుండా చర్యలు తీసుకుంటునట్లు మండల ప్రత్యేకాధికారి, డీఈఓ రమేష్‌కుమార్ పేర్కొన్నారు. మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో శనివారం ఎంపీడీఓ లక్ష్మీదేవి అధ్యక్షతన పలు శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపికలో జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. సమావేశంలో కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు.

లింగాలలో..

లింగాల: మండలంలోని ఆయా గ్రామాలలో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని ఎంపీడీఓ చంద్రశేఖర్ అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో శనివారం పంచాయతీ కార్యదర్శులు, ఉపాధి సిబ్బంది, ఇతర శాఖల అధికారులతో తాగునీటి సమస్యపై ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ పంచాయతీ కార్యదర్శులకు తగు సూచనలు, సలహాలు ఇచ్చారు. మిషన్ భగీరథ నీటి సరఫరాలో అంతరాయం కలిగితే ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఆయా గ్రామ పంచాయతీల కార్యదర్శులు పాల్గొన్నారు.

సర్టిఫికెట్ల ప్రదానం

కొల్లాపూర్: పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎన్‌ఐఐటీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మూడు వారాల కోర్సు పూర్తి చేసిన విద్యార్థులకు సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ ఉదయ్‌కుమార్ మాట్లాడుతూ విద్యార్థులకు జీవనోపాధి అవకాశాలు పెంపొందించేందుకు ప్రత్యేక శిక్షణా తరగతులు నిర్వహిస్తున్నట్లు వివరించారు. అధ్యాపకులు రమేష్‌కుమార్, వెంకటయ్య, కురుమయ్య, సోఫీ, మహదేవుడు, బాలు, విష్ణు, కేశవులు, బాలరాజు, మౌనిక, అనిత ఉన్నారు.

హజ్ యాత్రికులకు టీకాలు వేయాలి

నాగర్‌కర్నూల్ క్రైం: హజ్‌యాత్రికులకు ఆరోగ్య పరీక్షలు చేయడంతో పాటు టీకాలు వేయాలని హజ్ సొసైటీ ప్రెసిడెంట్ షేక్ ఫరీద్ అహ్మద్ కోరారు. శనివారం డీఎంహెచ్ఓ డా.స్వరాజ్యలక్ష్మిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ నెల 26న రూబీ గార్డెన్‌లో మక్కాకు వెళ్లే 27 మంది హజ్ యాత్రికులతో సమావేశం నిర్వహిస్తున్నామని వివరించారు. ఎమ్మెల్యే రాజేష్‌రెడ్డి హాజరవుతారని పేర్కొన్నారు. డీఎంహెచ్ఓ స్పందిస్తూ హజ్ యాత్రికులకు టీకాలు వేస్తామని హామీ ఇచ్చారు. డాక్టర్ రవికుమార్, ఇబ్రహీం, మౌలాపీరా పాల్గొన్నారు.